ప్రమాదకరంగా బయో వేస్టు

- ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కుప్పలుగా ఖాళీ సెలైన్ బాటిళ్లు
- బయో మెడికల్ వేస్టేజ్ నిర్వహణ.. అంతంత మాత్రమే
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

బయో మెడికల్ వేస్ట్.. మామూలు చెత్తతో పోలిస్తే చాలా రెట్లు ప్రమాదకరం. దీన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ 48 గంటల్లోపు క్లీన్ చేయాల్సిన బయో చెత్తను గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో అలానే ఉంచేస్తున్నారు. దీంతో రోగులకు మరిన్ని అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశంఉంది. ఇటీవల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసి పారిశుధ్యం మెరుగుపరచాలని ఆదేశించినా ఆస్పత్రి అధికారుల్లో మార్పు కనిపించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.


ఆస్పత్రి ఆవరణలో పడేసిన ఖాళీ సెలైన్ బాటిళ్లు, బయో వేస్టేజ్


ఆరు బయట పడేసిన విరిగిన మంచాలు, స్క్రాప్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీరాయ్ సాహెబ్ మిడతల హంపయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్టేజ్ నిర్వహణ అంతంత మాత్రంగా కనిపిస్తోంది. ఈ అపరిశుభ్ర పరిస్థితుల్లో ఉన్న రోగాలకు తోడు కొత్త రోగాలొచ్చే ప్రమాదముంది. ఆస్పత్రి ఆవరణలోని ఆక్సిజన్ ప్లాంట్ పక్కనున్న పాడుబడిన స్టాఫ్ క్వార్టర్స్‌తో పాటు ఖాళీ జాగాలో రోగులకు ఎక్కించిన సెలైన్ బాటిళ్లతో పాటు ఇతర బయో మెడికల్ వేస్టేజీను కుప్పలు తెప్పలుగా పడేశారు. ఎంసీహెచ్‌తో పాటు మార్చురీ, పేషెంట్ వెయింట్ హాల్ పక్కనే వీటిని పడేయడంతో రోగులకు కొత్తగా అనారోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. అసలే వర్షాకాలం. ఆపై భూమిలోకి కాలుష్య జలాలు ఇంకిపోయే ప్రమాదమూ లేకపోలేదు. వాస్తవానికి బయో మెడికల్ వేస్టేజ్ మొత్తాన్ని నాలుగు కేటగిరిలు (బిన్స్)గా విభజించి క్రమంగా డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ ఆస్పత్రి ఆవరణలోనే ఖాళీ సెలైన్ బాటిళ్లతో పాటు కొంత వేస్టేజీను పడేయటం, దానిని శుభ్రం చేయించకపోవడం చూస్తే అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ప్రజాధనం వృథా

ఆస్పత్రిలో పాడుబడిన మంచాలు, ఇతర సామగ్రి మొత్తం అక్కడే కుప్పలు కుప్పలుగా పడేశారు. దీంతో ఆ ఇనుప సామాగ్రి మొత్తం వానకు తడిచి తుప్పు పట్టి గుజిరీకి కూడా పనికిరాకుండా పోతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి కొనుగోలు చేసిన సామగ్రి నిరుపయోగంగా మారినప్పుడు.. ఆ సామాగ్రిని ఆరుబయట పడేయకుండా స్టోర్ రూమ్‌లలో పెట్టడమో లేక నిరుపయోగంగా ఉన్న స్టాఫ్ క్వార్టర్స్‌లలోనైనా ఉంచాల్సింది. ఒక వేళ అలా కుదరకపోయినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల అనుమతితో సామగ్రిని వేలం వేసి విక్రయించగా వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖజానాలోకి వేయాల్సి ఉంది. కానీ ప్రజల సొమ్మే కదా తమదేమీ పోతుందన్న భావనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అర్ధరాత్రి మారువేషంలో వచ్చి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు ఆస్పత్రిలో అపరిశుభ్రతను తొలగించి పారిశుధ్యం మెరుగుపరచాలని ఆదేశించినా ఆస్పత్రి అధికారుల్లో ఎటువంటి మార్పు కనిపించలేదు. ఇప్పటికైనా అధికారులు ఆస్పత్రి ఆవరణలోని ఆరుబయట పడేసిన బయో మెడికల్ వేస్టేజీను డంపింగ్‌యార్డుకు తరలింపచేయడంతో పాటు నిరుపయోగమైన ఆ స్క్రాప్‌ను స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

బయో వేస్టేజీను శుభ్రం చేస్తాం



ఆస్పత్రిలో వెలువడే బయో మెడికల్ వేస్టేజీను ఎప్పటికప్పుడు పంపిస్తున్నాం. ఆస్పత్రి ఆవరణలో ఖాళీ సెలైన్ బాటిల్స్ కుప్పలు తెప్పలుగా పడేశారన్న విషయం నా దృష్టికి రాలేదు. అక్కడ ఎందుకు పడేశారో హెడ్ సిస్టర్స్‌తో చర్చించి ఆ ఖాళీ బాటిల్స్, ఇతర బయో వేస్టేజీను క్లీన్ చేయిస్తాం. ఆస్పత్రి ఆవరణలో పడేసిన పనికిరాని మంచాలు, ఇతర స్క్రాప్‌ను ఏమి చేయాలన్నది కమిటీ మీటింగ్‌లో చర్చించి తదుపరి చర్యలు చేపడుతాం.

– డాక్టర్ అజేంద్రరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

బాల్య వివాహాలతో అనర్థాలు


గుంతకల్లులో కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం


తాడిపత్రిలో కిశోరి బాలికలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ సాజిదాబేగం

గుంతకల్లు రూరల్/తాడిపత్రి రూరల్: చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహం చేయడం వల్ల అనేక అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉందని జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి అన్నారు. గుంతకల్లు పట్టణంలోని మారుతీ నగర్, సత్యనారాయణపేటలో మంగళవారం కిశోరి వికాసం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని గర్భం దాల్చడం వల్ల తల్లీబిడ్డ ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే మండలంలోని మొలకలపెంటలో కిశోరి వికాసం సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్రిష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని టైలర్స్‌కాలనీలో ఉన్న ఆర్‌పీజీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో సీడీపీఓ సాజిదాబేగం, ఎంఈఓ నాగరాజు మాట్లాడారు. అనంతరం 21వ కౌన్సిలర్ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో పలు పోటీల్లో గెలుపొందిన కిశోరి బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, నారాయణమ్మ, హెడ్‌మాస్టర్ ఆదిశేషారెడ్డి, మెడికల్ డిపార్ట్‌మెంట్ పుల్లయ్య, మహిళా పోలీసు సాయివైష్ణవి, ఏఎన్‌ఎం ప్రవల్లిక, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, వరలక్ష్మి, ఆశా వర్కర్ విజయలక్ష్మి, హెల్పర్ వసంత పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయాలపై దాడులు అమానుషం


గుత్తిలో సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు


బుక్కరాయసముద్రంలో సీఐ పుల్లయ్యకు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

గుంతకల్లుటౌన్/గుత్తి/బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో సాక్షి దినపత్రిక కార్యాలయాలపై కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు దాడులు చేయడం, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్టు చేయడం అమానుషమని జర్నలిస్టులు, వైఎస్సార్‌సీపీ నేతలు, వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల నేతలు మండిపడ్డారు. సాక్షి టీవీ డిబేట్‌లో అభ్యంతకర వ్యాఖ్యలు చేసిన విశ్లేషకుడు కృష్ణంరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప ఇలా దాడులు తెగబడటం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. అనంతపురం సాక్షి కార్యాలయంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాక్షి కార్యాలయాలపై దాడులను ఖండిస్తూ గుత్తిలో వర్కింగ్ జర్నలిస్టులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సీఐ వెంకటేశ్వర్లుకు వర్కింగ్ జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. అలాగే అనంతపురం సాక్షి కార్యాలయంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో సీఐ పుల్లయ్యకు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు.

సాక్షి కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

పామిడి: అనంతపురం సాక్షి కార్యాలయంపై తెలుగుతమ్ముళ్ల భౌతికదాడులు అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, మండల పట్టణ, రూరల్ కన్వీనర్లు, వైస్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్, సల్లావుద్దీన్, నీలూరి హరినాథ్ రెడ్డి మంగళవారం అన్నారు. వాస్తవాలను వెలికి తీస్తూ నిజాలను నిర్భయంగా రాస్తున్న సాక్షి కార్యాలయంపై తెలుగు తమ్ముళ్ల దాడులు ప్రతికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తున్నారన్నారు.

అరాచక పాలన



సాక్షి కార్యాలయాలపై దాడులు, కొమ్మినేని అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం. బీహార్ తరహా అరాచక పాలనను ప్రజలకు అందించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత ఉంది. సంక్షేమ పథకాలను అమలు చేయకపోతే ప్రజలే కూటమికి తగిన బుద్ధి చెబుతారు. ఇంత అరాచక పాలన ఇంతకుముందెన్నడూ చూడలేదు.

– బి.సురేష్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి, గుంతకల్లు

కొమ్మినేనిపై అక్రమ కేసు


ఫయాజ్‌బాషా

తాడిపత్రి రూరల్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులు కుట్ర పూరితంగా కేసు నమోదు చేయించి అరెస్టు చేయించారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతుందనడానికి అక్రమ కేసులనమోదు, అరెస్టులు అద్దం పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని నాయకులు చేస్తున్న అక్రమాలు, అవినీతిని బట్టబయలు చేస్తున్న సాక్షి మీడియాను ఎదుర్కొలేక కార్యాలయాలపై దాడులకు తెగబడుతున్నారన్నారు.

మున్సిపాలిటీలో అధికారుల బదిలీ

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా గుంతకల్లు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఎంఈ లీలాకృష్ణప్రసాద్ కర్నూల్ కార్పొరేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఆదోనిలో పనిచేస్తున్న ఇంతియాజ్ అలీని ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ డీఈగా పనిచేస్తున్న సురేష్ రాయదుర్గానికి అక్కడ పనిచేస్తున్న రవిప్రకాష్‌నాయుడును ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే అనంతపురం-ఏపీ టిడ్కోలో డీఈగా పనిచేస్తున్న షబానాను ఇక్కడికి బదిలీ చేశారు. గత ఆరునెలలుగా ఇక్కడ ఖాళీగా ఉన్న రెవెన్యూ ఆఫీసర్ స్థానంలో ప్రొద్దుటూరులో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును, ఖాళీగా ఉన్న టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ స్థానంలో తాడిపత్రిలో పనిచేస్తున్న మహబూబ్‌బాషాను ఇక్కడికి బదిలీ చేశారు. రాయదుర్గం నుంచి ఏఈ ప్రతాప్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న హరినాథ్ ఆదోనికి, ఆయనస్థాంలో తాడిపత్రిలో పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే బద్వేల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖాజాహుసేన్‌ను, గుత్తి, కళ్యాణదుర్గంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లు శ్రీదేవి, నారాయణప్పను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

శింగనమల సీడీపీఓగా లలితమ్మ



శింగనమల: శింగనమల ఐసీడీఎస్ సీడీపీఓగా లలితమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీడీపీఓ ఉమాశంకరమ్మ రాప్తాడు ఐసీడీఎస్‌కు బదిలీ కావడంతో, అనంతపురం రూరల్‌లో సీడీపీఓగా పని చేస్తున్న లలితమ్మను శింగనమలకు బదిలీ చేశారు. సీడీపీఓ లలితమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేసేలా చూస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఇద్దరికి గాయాలు


గాయపడిన వారిని పరామర్శిస్తున్న మంజునాథరెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని అయ్యవారుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమేష్‌రెడ్డి, జయరాంరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న యువనాయకుడు మంజునాథ్ రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు పాండురంగారెడ్డి తదితరులున్నారు.

ఎంపీడీఓగా కరుణ సాగర్

యల్లనూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓగా కరుణ సాగర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా వాసుదేవ రెడ్డి బాధ్యతలు చేపట్టేవారు. ఆ స్థానంలో చిలమత్తూరులో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ కరుణ సాగర్ బాధ్యతలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


పార్థనాయుడు (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పార్థనాయుడు(50) మంగళవారం సాయంత్రం గుండె పోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య సంజమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. పలువురు నాయకులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రీ సర్వే డీటీగా మునీంద్ర

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మునీంద్రను రెగ్యులర్ రీ సర్వే డీటీగా నియమించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణమ్మను పుట్లూరు సీనియర్ అసిస్టెంట్‌గా రెగ్యులర్ డీటీ, సీఎస్డీటీగా రామును నియమించారు.

సంక్షిప్త సమాచారం

13న ద్విచక్ర వాహనాల వేలం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తుప్పపట్టిన ద్విచక్ర వాహనాలలకు ఈ నెల 13న వేలం నిర్వహించనున్నట్లు సీఐ సాయిప్రసాద్ మంగళవారం తెలిపారు. దాదాపు 15 ద్విచక్రవాహనాలను వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 వేలు ముందుగా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

పెద్దవడుగూరు: గొడవలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలకు, దాడులకు పాల్పడినా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దాడులకు పాల్పడిన వారి పై రౌడీషీటర్ ఓపెన్ చేయడంతో పాటు కఠిన శిక్షలు అమలు చేస్తామన్నారు. కొందరు రౌడీషీటర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం ఉందని, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసులు దృష్టికి తీసుకురావాలన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

పెద్దవడుగూరు: ప్రజలందరూ కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు తెలిపారు. మల్లేనిపల్లికి చెందిన ఒక మహిళకు యాడికి మండలానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. అయితే ఆమె గర్భిణి కావడంతో పుట్టిళ్లు మల్లేనిపల్లికి వచ్చి కాన్పు కోసం పెద్దవడుగూరు ఆస్పత్రిలో చేరింది. కాన్పు ఇబ్బందిగా ఉంటుందని భావించి అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేయగా కోవిడ్ పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారించారు. పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

జాబ్‌మేళాకు ఏర్పాట్లు

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించబోయే జాబ్‌మేళా కార్యక్రమం ఏర్పాట్లను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. కొర్రపాడు గురుకుల పాఠశాలలో నిర్వహించే జాబ్ మేళాకు 50 కంపెనీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని యువతీ యువకులు పెద్ద ఎత్తున హాజరై జాబ్‌మేళాను విజయవంతం చేయాలనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్, పసుపుల శ్రీరామిరెడ్డి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమది మందిని అరెస్ట్ చేసామని సీఐ శివగంగాధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.26,570 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కసాపురంలో మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మన్యుసూక్త హోమం నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి

గుత్తి: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్నామని జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అన్నారు. గుత్తిలోని ఆర్‌అండ్‌బీ గేట్ వద్ద మంగళవారం జేవీవీ సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 36 సంవత్సరాలుగా మూఢ నమ్మకాలను సమాజం నుంచి తరమికొట్టడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. సైన్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు దేశాయి నాగరాజు,రామదాసు, వెంకప్ప, రామాంజనేయులు, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు


సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

గుత్తి: తమ న్యాయమైన డిమాండ్ల రిష్కారం కోసం సమ్మె కు దిగుతున్నామని మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు నోటీస్ అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నిర్మల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 21 వేలు ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆప్కాస్‌ను రద్దు చేయకూడదని, రిటైర్ మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలనే డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపడతామన్నారు.

గొర్రెలకు టీకాలు


శింగనమల: నీలినాలుక వ్యాధి ప్రభావితం ఉన్న గ్రామాల్లో ముందస్తుగా గొర్రెలకు టీకాలు వేస్తున్నట్లు అనంతపురం డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకుడు రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శివపురం గ్రామంలో గొర్రెలకు ఉచితంగా నీలి నాలుక టీకాలు వేశారు. శింగనమల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు, పద్మనాభం సలకంచెరువు పశువైద్యాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది వరలక్ష్మి, హరికృష్ణ, సాయి, ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం


తైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను సీఐ శివగంగాధర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో దాదాపు 550 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ రావు తెలిపారు. విజేతలు ఈనెల 23 నుంచి 25 వరకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: ప్రభుత్వాస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని మంగళవారం సీపీఎం నాయకులు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. డయాలసిస్ సెంటర్‌కు ప్రత్యేక జనరేటర్ ఏర్పాటు చేయాలని, టెక్నీషియన్ల సంఖ్యను పెంచాలని, రోగులకు ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేంద్ర, రంగమ్మ, జ్యోతి, లక్ష్మీ, సుగుణ, తిమ్మప్ప, బాష తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన బాలా రమేష్ బాబు


తాడేపల్లిలో జగనన్నతో బాలా రమేష్ బాబు, ఆయన కుమారుడు బాలా వివేక్ సాయి

యాడికి: మండల కేంద్రంలోని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలా రమేష్ బాబు సోమవారం తన కుమారుడు బాలా వివేక్ సాయితో కలిసి తాడిపల్లికి వెళ్లి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగనన్న తాడిపత్రి నియోజక వర్గంలోని రాజకీయాలపై బాలా రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. మండలంలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని జగన్ సూచించారు.

సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట


అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి ఎస్టీ కాలనీలో మంగళవారం సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని అర్చకులు ప్రారంభించి అమ్మవారి విగ్రహన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అర్చకులు ఆలయం ఎదురుగా హోమాలు, యాగాలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చనలు, గంగా జలాలతో అభిషేకాలు, హారతులు, మహా మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగి మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని బాట్లో కొత్తపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బాట్లో కొత్తపల్లికి చెందిన రామాంజనేయులు(50) అనంతపురంలో మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అనంతపురం నుంచి బస్సు దిగి రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తెలంగాణకు చెందిన ఫార్చునర్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రామాంజినేయులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'సూపర్ సిక్స్'ను గాలికి వదిలేశారు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీకేఎంయూ, రైతు, కార్మిక సంఘం నాయకులు

పుట్లూరు: ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను ఇస్తామని ఊకదంపుడు ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే హామీలను గాలికొదిలేశారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప కార్యదర్శి పెద్దయ్య విమర్శించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీకేఎంయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం పేదల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. వెంటనే రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఓబుళపతి, పెద్దన్న, బాలు, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.